క్లుప్తంగా

రాత పరీక్షకు 221 మంది అర్హత



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఏయూ క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి నియామక బోర్డ్ పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి రాత పరీక్షకు 221 మంది ఎంపికయ్యారు. గురువారం 280 మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన వారు కైలాసగిరి వద్ద ఉన్న జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి పి.ఎం.టి, పి.ఈ.టి పరీక్షలకు 280 మంది హాజరయ్యారు. ముందుగా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి బయోమెట్రిక్ తీసుకున్నారు. అనంతరం దేహదారుఢ్య పరీక్షలు జరిపారు. వీరిలో 221 మంది తదుపరి మెయిన్ రాత పరీక్షకు అర్హత సాధించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరావు, ఆర్ఐలు ఎల్.మన్మథ రావు, బి.రామకృష్ణారావు, ఐటీ కోర్ ఎస్ఐ బి.సురేష్ బాబు పాల్గొన్నారు.

19న వేమన జయంతి

సీతమ్మధార : వేమన జయంతి వేడుకలు ఈ నెల 19న నిర్వహిస్తామని వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొరుసు మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌కే బీచ్ రోడ్డులోని కాళీమాత దేవాలయం సమీపంలో 19న ఉదయం 9 గంటల నుంచి వేమన జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తి రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలు వేమన జయంతి వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు. అదేరోజున ఉదయం ఆశీలమెట్టలోని వేమనమందిరం ఆవరణలో గల వేమన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తామని తెలిపారు.

డీహైడ్రేషన్‌పై అప్రమత్తత అవసరం

బీచ్‌రోడ్డు : డయేరియా కారణంగా కలిగే డీహైడ్రేషన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని కెవ్యూ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ సూచించారు. డయేరియాపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డయేరియా రోగుల్లో డీహైడ్రేషన్‌ను తరిమి కొట్టడమే లక్ష్యంగా 'డబ్ల్యూహెచ్‌వో ఓఆర్ఎస్' విడుదల చేసిందన్నారు. ఉప్పు నీరు, సాధారణ ఓఆర్ఎస్ వల్ల డీహైడ్రేషన్ నియంత్రణలోకి రాదన్నారు. ఎలక్ట్రోలైట్స్ కలిగి ఉన్న శాస్త్రీయ ఆధారాలతో, నిపుణుల సిఫార్సులతో డబ్ల్యూహెచ్‌వో తయారు చేసిన ఓఆర్ఎస్‌ను మాత్రమే తీసుకోవాలని సూచించారు.

లలితాపీఠంలో ప్రత్యేక పూజలు

సీతంపేట : సంకట హర చతుర్థి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు శ్రీలలితా పీఠంలో విజయగణపతికి పంచామృత అభిషేకం, హరిద్ర గణపతి హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే శనివారం సాయంత్రం 6:45 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, శుద్ధ షష్ఠి సందర్భంగా ఆదివారం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకం, హోమం నిర్వహిస్తామని తెలిపారు. అష్టమి సందర్భంగా మంగళవారం సాయంత్రం 7 గంటలకు కాలభైరవ హోమం, అలాగే 22న ఉదయం 9:30 గంటలకు చండీహోమం జరుగుతుందని తెలిపారు. కుర్తాళం, సిద్ధేశ్వరీ పీఠం, శ్రీలలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి దర్శనం రోజూ ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు కల్పిస్తామని తెలిపారు.

ఎస్ఐలు కావలెను..!



ఎంవీపీ కాలనీ స్మార్ట్ పోలీసు స్టేషన్

- ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో అరకొర సిబ్బందితోనే సేవలు
- ఎస్ఐల బదిలీతో ఫిర్యాదుదారులకు తప్పని అవస్థలు
- ఉన్న సిబ్బందిపై పని భారం
- ఫిర్యాదుల పరిష్కారంపైనా ప్రభావం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ శాంతి భద్రతల పోలీస్ స్టేషన్‌ని సిబ్బంది కొరత వెంటాడుతోంది. నగరంలో తొలి స్మార్ట్ పోలీసు స్టేషన్‌గా పోలీసుశాఖ ఎంవీపీ క్రైమ్, శాంతి భద్రతల పోలీసు స్టేషన్లను గతంలో అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్ పోలీసు స్టేషన్‌గా అభివృద్ధి చేయడంతో సాధారణంగానే ఇక్కడి సేవలపై నగర వ్యాప్తంగా ఆసక్తి ఉంది. అయితే అన్ని సౌకర్యాలతో ఇక్కడ స్టేషన్ అభివృద్ధికి పెద్దపీట వేసిన నగర పోలీసు అధికార యంత్రాంగం అవసరమైన మేర సిబ్బంది నియామకాలు చేపట్టడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తొలి నుంచి ఈ స్టేషన్ అధికారులను సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఫలితంగా ఫిర్యాదుల పరిష్కారం, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, స్టేషన్ పరిధిలో గస్తీ తదితర అంశాలు ప్రస్తుతం ఉన్న సిబ్బందికి సవాల్‌గా మారుతున్నాయి.

ఒక్క ఎస్ఐతో నెట్టుకొస్తూ...

వాస్తవానికి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో 4 నుంచి 5 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం సీఐ మురళీతోపాటు కొత్తగా నియమితులైన ఒక ఎస్ఐ మాత్రమే విధుల్లో ఉన్నారు. గతంలో ముగ్గురు ఎస్ఐలు, ఒక వుమెన్ ఎస్ఐ ఉండగా ప్రస్తుతం వారంతా బదిలీపై వెళ్లిపోయారు. ఎస్ఐలు ఒక్కరొక్కరుగా ఇక్కడ నియమితులు కావడం, నెల రోజుల్లోనే బదిలీపై వెళ్లిపోవడం ఈ స్టేషన్‌లో పరిపాటిగా మారిపోయింది. ఇటీవల కాలంలో అరడజను మంది ఎస్ఐలు ఇక్కడి నుంచి వెళ్లిపోవడమే ఇందుకు నిదర్శనం. ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు ఎక్కువ కాలం ఇక్కడ విధులు నిర్వర్తించగా ఇటీవల ఆయన సిక్ లీవ్‌పై వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఆయన కూడా బదిలీపై వెళ్లారనే ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు కొన్ని నెలల క్రితమే ఇక్కడ ఎస్ఐలుగా నియమితులైన వర్మ, దయానంద్ తదితరులు బదిలీలు చేయించుకోవడంతో ప్రస్తుతం స్టేషన్‌కు ఎస్ఐలు లేకుండా పోయారు. తొలి నుంచి ఎంవీపీ స్టేషన్‌కు ఫిర్యాదుల తాకిడి ఎక్కువగా ఉండగా వారితో మాట్లాడే వారు, సమస్యలు విని పరిష్కరించే వారు, ఇరు వర్గాలకు మధ్య సంధి కుదుర్చి ఒప్పంద పత్రాలు రాయించే వారు కరువయ్యారు. దీంతో ఫిర్యాదుదారులు రోజుల తరబడి స్టేషన్ చుట్టూ తిరగడంతోపాటు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రోజుల తరబడి స్టేషన్ చుట్టూ తిరగడం, గంటల తరబడి స్టేషన్‌లో నిరీక్షించడం మినహా ఎలాంటి ఫలితం ఉండటం లేదంటూ పలువురు ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌లో ఫిర్యాదుల పరిష్కారంపై ఎవరూ బాధ్యత తీసుకోవడంలేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా నగర పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నగరంలో కీలకంగా ఉన్న ఎంవీపీ పోలీసు స్టేషన్‌కు ఎస్ఐలతోపాటు అవసరమైన సిబ్బందిని నియమించి పరిస్థితిని చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.



సమస్యలు వివరించేందుకు స్టేషన్‌లో వేచి చూస్తున్న ఫిర్యాదుదారులు (ఫైల్)

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 23 వరకూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆరాధాన ట్రస్ట్ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. ఈ ఏడాది ఏడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. తొలి రోజు 17న తమిళనాడు సంగీత, లలిత కళల విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, ప్రముఖ వీణ విద్వాన్సురాలు వీణా ఈ.గాయత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక సంగీత కళాభారతి అవార్డును ప్రముఖ నాదస్వర విద్యాంసుడు గురువిళ్ల అప్పన్నకు అందిస్తున్నామని తెలిపారు. అవార్డుతో పాటు, పట్టు వస్త్రాలు, ప్రశంసాపత్రం, రూ.10వేలు నగదు పురస్కారం అందిస్తామన్నారు. అనంతరం సంగీత కార్యక్రమంలో హంస అకాడమీ అధ్యాపకులు, విద్యార్థులు త్యాగరాజ కీర్తనలతో కూర్చిన 'సంగీత సాహిత్య సద్భక్తి సమన్వయం' కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. రెండో రోజు 18న ఉదయం 7 గంటలకు స్థానిక త్యాగరాజ ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన తర్వాత శ్రీ సీతారామ పరివారాన్ని ఊరేగింపుగా కళాభారతి చుట్టూ, వందలాది కళాకారులు గానం చేస్తుండగా కోలాటం, నాదస్వర వాయిద్యాలతో, కార్యదర్శి డాక్టర్.గుమ్ములూరి రాంబాబు త్యాగరాజ వేషధారణలో భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

అనంతరం 200 మంది పైగా సంగీత విద్వాంసులు ఘనరాగ పంచరత్న కీర్తనలు ఆలపిస్తారని తెలిపారు. అనంతరం మంగళ ధ్వని – నాదస్వర వాద్యం గురువిల్లి అప్పన్న బృందం కచేరీ ప్రారంభమవుతుందని తెలిపారు. వారం రోజులపాటు జరిగే కచేరిలో పాల్గొనేందుకు 1169 దరఖాస్తులు రాగా వాటిలో 1110 అంగీకరించామన్నారు. ఏడు రోజుల పాటు 404 సంగీత కచేరీలు నిర్వహించనున్నామన్నారు. చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నుంచి కళాకారులు తరలివస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భయపెడుతున్న యూటర్న్



ప్రమాదకరంగా వున్న యూటర్న్ వద్ద వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు ఆశీలమెట్టలోని సబ్‌వేలో రెండు వైపుల వాహనాల రాకపోకలతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా ఇక్కడి జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న యూటర్న్ ప్రమాదభరితంగా మారినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ ఎవరైనా యూటర్న్ తిరుగుతుంటే రామా టాకీస్ మార్గం నుంచి వచ్చే వాహన చోదకులు కొద్ది సేపు ఆగిపోవలసి వస్తుంది. శ్రీ చైతన్య కళాశాల మార్గం నుంచి యూటర్న్ వద్ద మలుపు తిరిగి రామా టాకీస్ వైపు వెళ్లే క్రమంలో ఈ మార్గంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఆగిపోవాల్సిందే. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రామా టాకీస్ వైపు వెళ్లే బస్సులు సబ్‌వే మీద నుంచి వెళ్తాయి. గతంలో ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంతో నాలుగేళ్ల క్రితం అప్పటి పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్హా ప్రమాదాలు జరగకుండా సబ్‌వే మార్గంలో వన్‌వే విధానం అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత మద్దిలపాలెం నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వైపు వెళ్లే వాహనాలు ఈ సబ్‌వే మార్గం ద్వారానే రాకపోకలు సాగించేవి. గత ఏడాది నుంచి రెండు వైపుల భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పైగా ఈ మార్గంలో వాహనాలు ఓవర్ టేక్ చేయకూడదు. ఈ మేరకు తెలుపు రంగు మార్జిన్లు కూడా ఉన్నాయి. కాని వాహన చోదకుల అత్యుత్సాహం కారణంగా ఈ మార్గంలో యథేచ్ఛగా ఓవర్ టేక్ చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సాటి వాహన చోదకులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా ద్వారకా స్టేషన్ ట్రాఫిక్ విభాగం అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

2030 నాటికి బిలియన్ డాలర్ల పసుపు ఎగుమతే లక్ష్యం

బీచ్‌రోడ్డు : భారత పసుపు ఎగుమతులు 2030 నాటికి ఒక బిలియన్ డాలర్లకు చేరుకోవాలనేది లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ డైరెక్టర్ దీపక్ మిశ్రా అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆమ్వే ఇండియా అధ్వర్యంలో పసుపు రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2020 నాటికి పసుపు గ్లోబల్ మార్కెట్ 58.2 మిలియన్ల డాలర్లు ఉందని... ఈ మార్కెట్ 2028 నాటికి 16.1 శాతం వృద్ధి సాధిస్తుందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అంచనా వేసిందన్నారు. ఈ లక్ష్యానికి మద్దతుగా ప్రభుత్వం జాతీయ పసుపు మండలి ఏర్పాటు చేసిందన్నారు. ప్రపంచ పసుపు మార్కెట్‌లో భారతదేశ స్థానాన్ని పెంపొందించడానికి వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆమ్వే ఇండియా ఎండీ రాజనీష్, డాక్టర్ అర్పిత తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యం



రోడ్డు భద్రతపై వివరిస్తున్న డీటీపీవో అప్పలనాయుడు

మద్దిలపాలెం : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ప్రజా రవాణా శాఖ డ్రైవర్లది కీలక బాధ్యత అని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మద్దిలపాలెం డిపోలో గురువారం ఆయన డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పాదచారుల కదలికలను గమనిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణకుమారి, ఎ.మణికుమారి, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో తాబేళ్ల సంరక్షణ



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలు, సుస్థిర చేపల వేట విధానంపై కలెక్టర్ గురువారం సమీక్షించారు. పలు శాఖల అధికారులు, శాస్త్ర వేత్తలు, ఫిషింగ్ బోట్ యజమానుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆడ తాబేళ్లు నవంబర్, ఫిబ్రవరి మధ్యలో తీరానికి వచ్చి గుడ్లు పెడతాయన్నారు. ఇటీవల సముద్ర తాబేళ్ల మృత కళేబరాలు తీరానికి చేరడం గమనిస్తున్నామని, అవి చేపల వేట సమయంలో వలల్లోను, సముద్రంలో విడిచిపెట్టే తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో చిక్కుకుని మరణిస్తున్నాయని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఇలాంటి పరిణామాల వల్ల భవిష్యత్తులో ఆలీవ్ రిడ్లే రకపు తాబేళ్లు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తాబేళ్లు తప్పించుకునే అవకాశం ఉన్న టీఈడీ పరికరాన్ని వినియోగించాలన్నారు. వన్య మృగ సంరక్షణ చట్టం – 1972 ప్రకారం తాబేళ్లను చంపడం, తినడం, అమ్మడం, రవాణా చేయడం నిషేధం అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ జిల్లా అధికారి శ్రీవాణి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణ రావు, కేంద్ర మత్స్య సంస్థల ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్ కిజాకుద్దీన్, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) జోనల్ డైరెక్టర్ భామి రెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, మెరైన్ సీఐ దివాకర్, మత్స్యశాఖ ఏడీ విజయ కృష్ణ, పోలీసు అధికారులు, నెట్ ఫిష్ స్టేట్ కో–ఆర్డినేటర్ హన్మంతరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆషాజ్యోతి, డాల్ఫిన్ మెకనైజ్డ్ బోటు యజమానుల సంఘ అధ్యక్షుడు వీర్రాజు, సంప్రదాయ బోట్ల ప్రతినిధి జి.యల్లయ్య (కింగ్) తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనసు దోచే సుందర సాగరతీరం



నిత్యం చూసినా ప్రకృతి ఎప్పుడూ కొత్తగా కవ్విస్తూనే ఉంటుంది. తెలియని కొత్తదనం తొణికిసలాడుతుంది. గురువారం ఉదయం అలాంటి సుందర దృశ్యమే సముద్ర తీరంలో కనిపించింది. పాల నురగల కెరటాలు, నీలం, ఆకుపచ్చ రంగులో సముద్రపు నీరు, జీవన నావను నడుపుకుంటూ వెళ్తున్న మత్స్యకారులు, కెరటాలపై ఉదయభానుడి కిరణాలతో బంగారు వర్ణాలు అద్దాయి. నూతన ఉత్తేజాన్ని కలిగించే ఇటువంటి దృశ్యాలు విశాఖ వాసులను నిత్యం పలకరిస్తాయి. ఆస్వాదించే మనసు, వీక్షించే ఆసక్తి ఉంటే సూర్యోదయానికంటే ముందుగా సాగర తీరానికి చేరుకోవాల్సిందే. సముద్ర గర్భంలో నుంచి ఉదయభానుడు ప్రభవిస్తున్నాడా అన్నట్లు మనల్ని భ్రమింపచేసే ఈ సుందర దృశ్యం మనసును దోచుకుంటుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వీధిలైట్లకు పండగ సెలవులు..!

- తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లోని పలు కాలనీల్లో అంధకారం
- పట్టించుకోని జోన్ – 3 ఇంజినీర్లు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధిలో ఏ ముహుర్తాన వీధిలైట్ల కాంట్రాక్ట్‌ని బీ అండ్ ఆర్ సంస్థకు అప్పగించారో అప్పటి నుంచి లైట్లు పూర్తి స్థాయిలో వెలగడం లేదని ప్రజలు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విశాఖ ఉత్తర, తూర్పు నియోజకవర్గాల పరిధిలో వీధిలైట్ల వ్యవస్థ అధ్వానంగా తయారైందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతి సెలవులు ఉద్యోగులకే కాదు వీధిలైట్లుకి కూడా ఇచ్చారా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జోన్ – 3 పరిధిలో సుమారు 8 వేల వరకు వీధి లైట్లు ఉన్నాయి. ఇందులో 20 శాతం వరకు లైట్లు వెలగడం లేదని అంచనా. అంటే కాంట్రాక్టర్ మీద జీవీఎంసీ ఇంజినీర్ల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిర్లక్ష్యం వల్లే వీధుల్లో చీకటి

సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శులంతా విధిగా రోజూ రాత్రిపూట వీధుల్లో తిరిగి వెలగని వీధిలైట్ల నంబర్లు నోట్ చేసుకుని కాంట్రాక్టర్ ద్వారా మరమ్మతులు చేయాలని ఆదేశించినా ఆచరణలో సాధ్యంకాని పనిగా తేలిపోయిందంటే అతిశయోక్తి కాదు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు చీకట్లో మగ్గిపోతున్నాయంటే అతిశయోక్తి కాదు. సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, సత్యం జంక్షన్, గాంధీనగర్, క్రాంతినగర్, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, బాలయ్యశాస్త్రి లే అవుట్, అభయాంజనేయ స్వామి కోవెల, పాపాహోమ్ రోడ్డు, రాధాకృష్ణ లే అవుట్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో లైట్లు సక్రమంగా వెలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పగలు కూడా నిక్షేపంగా లైట్లు వెలగడం విశేషం. జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక రాత్రిపూట అంధకారం నెలకొంటుందని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట డ్యూటీ నుంచి ఇంటికెళ్లే ఉద్యోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇక్కడి మోడ్రన్ లైట్లు వెలగడం లేదు. ఒక పోల్‌కి రెండు లైట్లు వుంటే ఒకటి వెలగడం లేదు. అలాగే, మోడ్రన్ విద్యుత్ పోల్‌కి రెండు లైట్లు వుంటే ఒక లైటు కనిపించడం లేదు. ఇంకా వీధిలైట్లకు చెట్ల కొమ్మలు అడ్డం ఉండడంతో అంధకారం నెలకొంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు అంధకారం, మరోవైపు కుక్కల బెడద కారణంగా రాత్రిపూట పాదచారులు, వాహనచోదకులు పడరానిపాట్లు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఫిర్యాదులు చేయలేని పరిస్థితి

కూటమి ప్రభుత్వం వచ్చాక వార్డు వలంటీర్ వాట్సప్ గ్రూపులు లేకపోవడం, సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శుల మొబైల్ నెంబర్లు అందుబాటులో లేని కారణంగా ఫిర్యాదులు చేయడానికి ప్రజలు అగచాట్లు పడాల్సి వస్తోంది. ఇక పలు ప్రాంతాల్లో పగలు కూడా వీధి లైట్లు నిక్షేపంగా వెలుగుతూ విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాంట్రాక్ట్ సిబ్బంది సకాలంలో ఫిర్యాదులు పరిష్కరించకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చీకట్లో కుక్కల బెడద కూడా ఉంది. ఇప్పటికైనా జీవీఎంసీ పబ్లిక్‌వర్క్స్ ఇంజినీర్లు స్పందించి జోన్ – 3 పరిధిలో గల తూర్పు, ఉత్తర నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో వెలగని వీధిలైట్లకు మరమ్మతులు నిర్వహించాలని, మాయమైన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



పాపాహోం రోడ్డులో వెలగని వీధిలైటు



బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద వెలగని వీధిలైటు



అభయాంజనేయ స్వామి ఆలయం రోడ్డులో వెలగని లైట్లు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



జీవీఎంసీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు

అగనంపూడి: నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. 88వ వార్డు దువ్వాడ పరిధిలోని దుకాణాల్లో దాడులు నిర్వహించిన సిబ్బంది 50 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, స్పూన్లు స్వాధీనం చేసుకొని జీవీఎంసీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ మాట్లాడుతూ పాలిథిన్ కవర్లను వ్యాపారులు వినియోంచవద్దని, విక్రయాలు చేయొద్దని, నార, గుడ్డ సంచులను వినియోగించాలని కోరారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదినారాయణ తదితరులు

అగనంపూడి: వచ్చేనెల 6వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు శ్రీకాకుళంలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభల వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ ఆవిష్కరించారు. కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా, ఉపాధి, ఉద్యోగావకాశాల సాధన కోసం దేశ వ్యాప్తంగా ఏఐవైఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. నిరుద్యోగ సమస్యలపై యువతలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తుందని, నిరుద్యోగ యువత కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుతరావు, వై.రాంబాబు, నాయకులు జి.ఆనంద్, కిరణ్, లక్ష్మి, రజని, ఉమ తదితరులు పాల్గొన్నారు.